క్లుప్తంగా

ఎంపీడీవో సందర్శన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో ఎస్.రమేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్ డేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమ విజయవంతానికి సిబ్బంది కృషి చేయాలని కోరారు.

'మెగా పేరెంట్స్ టీచర్స్ డే'కు రూ.2.90 లక్షల మంజూరు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ డే నిర్వహణకు మొత్తం రూ.2.90 లక్షలు మంజూరైనట్లు ఎంఈవో బి.చంద్రశేఖర్, ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజులు తెలిపారు. ఇదే విషయమై వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పండగ వాతావరణంలో కార్యక్రమ నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. మండల వ్యాప్తంగా ఉన్న మొత్తం 156 పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్య సమీక్ష, ఎగ్జిబిషన్, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

16 వినతుల స్వీకరణ

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 16 వినతులు వచ్చాయని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ -2047 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుకాంత్ జన్ మాట్లాడుతూ.. 2047 సంవత్సరం నాటికి భారతదేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

40 వేల చేప పిల్లల విడుదల

భామిని: మండలంలోని మణిగ, నల్లరాయిగూడ, బొడ్డుగూడ పంచాయతీల్లోని 14 చెరువులలో ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు 40 వేల చేప పిల్లలను గిరిజన సంఘ నాయకులు శుక్రవారం విడిచి పెట్టారని మండల ఫిష్ అధికారి కె.ఆదినారాయణ తెలిపారు. చేపల పెంపకం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి పొందాలని ఆకాంక్షించారు.

సమన్వయంతో పనిచేయాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు శుక్రవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన.. పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దని, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి జరగాలన్నారు. ఇంటి పన్ను, నీటితీరువా వసూళ్ల లక్ష్యాలపై దృష్టి సారించాలని ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం



కొత్తగా వేస్తున్న రహదారి

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారి రెండో విడత విస్తరణ పనులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 5.50 కోట్ల వ్యయంతో ఎనిమిది నెలల కిందట మొదటి విడత పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం వీరఘట్టం అంబేడ్కర్ సెంటర్ నుంచి నీటిపారుదల శాఖ కార్యాలయం వరకు సుమారు 200 మీటర్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే ఈ పనులకు నిధులు చాలవని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మిగిలిన రహదారి పనులు పూర్తి చేస్తామన్నారు.

మైక్‌సెట్ వితరణ

పాలకొండ రూరల్: మండలంలోని యరకారాయపురం ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి కరణం జగదీష్ రూ.10వేల విలువగల మైక్ సెట్‌ను శుక్రవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాసపు వాసుదేవరావు, సర్పంచ్ శ్రీనివాసరావు, బి.నీలకంఠంనాయుడు, సుదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

పూతే కీలకం..



బెజ్జి సమీపంలో పూతకు వచ్చిన మామిడి సాగు (ఇన్‌సెట్లో) తమ్మినేని అమరేశ్వరి

- సరైన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఉద్యానవన శాఖాధికారులు

పాలకొండ రూరల్: పండ్లలో రారాజుగా పిలువబడుతున్న మామిడి సాగులో పూతే కీలకమని పాలకొండ ఉద్యానవన శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత శీతాకాల సీజన్‌లో మామిడి పూత ప్రారంభంకానున్న నేపథ్యంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో నాలుగువేల పైచిలుకు ఎకరాల్లో ఎక్కువగా బంగినపల్లి, కలెక్టర్, పనుకులతో పాటు ఇతర రకాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో మామిడి పూత ఆశాజనకంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి లాభసాటిగా ఉంటుందని ఉద్యానవన శాఖాధికారి టి.అమరేశ్వరి తెలిపారు. మామిడి సేద్యంలో రాత్రి సమయంలో అధిక చలి, పగలు వేడి వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో పూత, పిందెను రక్షించుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు సాగుకు సంబంధించి ఆమె పలు సూచనలు చేశారు.



బద్దుమాసింగలో మామిడి తోటల సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

పూత, పిందె రాలకుండా తీసుకోవాల్సిన చర్యలు..

- పూత మొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించడానికి డిసెంబర్‌లో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు చొప్పున లీటర్ నీటిలో కలిపి చెట్లకు పిచికారీ చేయాలి.
- పూత మొగ్గలు పెరుగుదల దశలో తేలికపాటి నీటి తడులు ఇస్తే త్వరగా పిందెలు కడతాయి.
- నీటి ఎద్దడి వల్ల పోషక లోపాలు ఏర్పడడం, హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడం జరుగుతుంది. దీంతో పూత, పిందె రాలుతుందని గమనించాలి.

సస్యరక్షణ ఇలా..

తేనెమంచు పురుగు ఆశిస్తే పూతదశలో పూలు విచ్చుకోవు. దీనికి ఇమిడాక్లోప్రిడ్ మందు 0.3 ఎంఎల్ లేదా యామిథాక్సమ్ 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- తామర పురుగులు ఆశిస్తే పూత మొగ్గ దశలో డైమిథోయేట్ 2 ఎంఎల్ లేదా యామిథాక్సామ్ 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిన్న పిందె దశలో ఆశిస్తే ఫిప్రోనిల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా హెక్సా కోనోజోల్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పూతపై మాడు తెగులు నివారణకు నివారణకు సాఫ్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మచ్చతెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా గ్రాము కార్బండిజమ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మసి తెగులు నివారణకు గ్రాము కార్బండజిమ్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బోరాన్ లోపం నివారణకు బోరాక్స్‌ను 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- మొగ్గదశలో ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 3 ఎంఎల్, డైక్లోరోవాస్ 0.5 ఎంఎల్, మాంకోజెబ్ 2 గ్రాములు చొప్పున లీటర్ నీటిలో కలిపి చెట్లకు పిచికారీ చేసుకోవాలి.
- పచ్చిపూత దశలో ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్, డైక్లోరోవాస్ 0.5 ఎంఎల్ లేదా, మిథైల్ డెమటాన్ 2 ఎంఎల్, సాఫ్ లేదా కంపానియన్ 2 గ్రాముల చొప్పున లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- తెల్లపూత దశలో మందులు పిచికారీ చేయకూడదు. అవసరమైతేనే ఇమిడాక్లోప్రిడ్ 0.25 ఎంఎల్, ఆంత్రాకాల్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కంటి పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం సీహెచ్‌సీలో నేత్ర శస్త్రచికిత్స చేయించుకున్న వారికి శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు చేసిన తర్వాత కళ్లు ఏ విధంగా పనిచేస్తున్నాయి అని తెలుసుకుని, కంటి చూపు బాగుండడానికి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై వైద్య సిబ్బంది పలు సూచనలు చేశారు. కంటి ఆపరేషన్లు చేసుకున్న వారం రోజుల తర్వాత కొనసాగింపు పరీక్షల్లో భాగంగా నేత్ర వైద్య తనిఖీలు చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు.



కంటి ఆపరేషన్లు చేసుకున్న వారి కళ్లను పరిశీలిస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించం

- మంత్రి సంధ్యారాణి

సీతంపేట: గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను తొలగించే ప్రసక్తే లేదని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద ఉపాధ్యాయులు, అధ్యాపకులు కొద్దిరోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, తమ పోస్టులను సీఆర్‌టీగా మార్చాలని, 2022 పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. శాంతియుత నిరసన ర్యాలీ చేస్తుంటే షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని గిరిజన సంఘ నాయకుడు బి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేశ్వరరావు, బి.గణేష్, చిరంజీవి, భవానీ, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి సమస్యలు చెబుతున్న అవుట్ సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్

బకాయి వేతనాలు చెల్లించాలి

గ్రీన్ అంబాసిడర్లకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీపీఎం నాయకుడు మండంగి రమణ కోరారు. ఇదే విషయమై ఆయన పలువురు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రజారోగ్యం కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్ల జీతాలు 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారి కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు. చొరవ తీసుకుని, వెంటనే జీతాల చెల్లింపు జరిగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.
–గుమ్మలక్ష్మీపురం



● ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



పాలకొండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

ప్రపంచ మేధావి, రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా కార్యక్రమంలో పాల్గొని, అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆదర్శప్రాయుడు, సమసమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్ అని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన పాటుపడిన తీరు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. -పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న ఎంపీపీ బొమ్మాళి భాను, తదితరులు



గరుగుబిల్లి: నాగూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం



గుమ్మలక్ష్మీపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఎస్మా ప్రయోగించడం సరికాదు..

పాలకొండ రూరల్: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న 104 సిబ్బందిపై ఎస్మా ప్రయోగించడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 104 వ్యవస్థల్లో కీలకమైన ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు.

జీతాలు, పెన్షన్లు అందించాలి..



ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుమార రాజుకు వినతిపత్రం అందిస్తున్న గణేష్‌బాబు

పాలకొండ రూరల్: శాఖా గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని రాష్ట్ర గ్రంథాలయ శాఖ కోశాధికారి బబ్బూరి గణేష్‌బాబు కోరారు. ఈ మేరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బుర్రి కుమారరాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గణేష్‌బాబు మాట్లాడుతూ.. సంబంధిత ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందించేకు అదనపు గ్రాంట్లు అవసరముంటుందన్న విషయంపై యంత్రాంగం చొరవ చూపాలన్నారు. ప్రస్తుతం సెస్ బకాయిలు వసూలు చేసి జీతాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి వీవీజీ.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి గిరిజ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని దురిబిలి, సూర్యనగర్ గ్రామాల్లో రైతులకు కూరగాయల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా కూరగాయలను సాగు చేయడం ఎలా అనే విషయాన్ని ఉద్యాన శాఖ అధికారి గిరిజ తెలిపారు. అలాగే జియ్యమ్మవలస మండలంలోని పరసపాడు, సింగనపురం గ్రామాల్లో కూరగాయలు పండిస్తున్న రైతులను ఈ కార్యక్రమానికి తీసుకువచ్చి, కూరగాయలు పండించడంలో వారు అనుసరిస్తున్న మెలకువలను వారికి తెలియజేయించారు.

● అవగాహన..



పాలకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆన్‌జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా బ్యాంక్ విధులపై అవగాహన కల్పించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బ్యాంక్‌కు తీసుకెళ్లి సిబ్బంది విధులను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరగోపాల్ మాట్లాడుతూ, ఈ నెల ఒకటో తేదీ నుంచి ఒకేషనల్ విద్యార్థులక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అధ్యాపకులు వెలమల అప్పారావు, అన్నపు గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ

సమస్యలు పరిష్కరించేందుకే 'రెవెన్యూ సదస్సులు'

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పాలకొండ: భూ సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొండాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 80 శాతం మంది రైతులున్న మన రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. భూ సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఎస్. మన్మధరావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎంపీడీఓ విజయరంగారావు, సర్పంచ్ రాయి వనజ, కర్నేన అప్పలనాయుడు, గర్భాన సత్తిబాబు, జాడ శ్రీధర్, పల్లా కొండలరావు, గంటా సంతోష్, లంక మహేంద్రనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు స్వీకరిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

సద్వినియోగం చేసుకోవాలి...

భామిని: భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు కోరారు. మండలంలోని పాలవలస, మనుమకొండలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌కుమార్, కొట్టుగుమ్మడి కృష్ణారావు, సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మల కోరా, రైతులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో ప్రకృతి ఇస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల నేల నిస్సారమైపోతోందని, సేంద్రియ ఎరువులను వినియోగించి, నేల సారవంతమయ్యేలా చూడాలని రీజనల్ తీమోటిక్ లీడ్ కె.ప్రకాష్ సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం సిబ్బందికి నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎం పి.షణ్ముఖరాజు, ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల కిట్లు అందజేస్తున్న రీజనల్ తీమోటిక్ లీడ్ ప్రకాష్

పక్కాగా డ్రైడే పాటించాలి

కొమరాడ: పక్కాగా డ్రైడే పాటించాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని పెదశాఖ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామాన్ని సందర్శించిన ఆయన పలుచోట్ల మురుగునీటి కాలువల్లోని మురుగును చూసి, ఎక్కడా మురుగునీరు ఉండకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు దోమల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎండభద్ర గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి, అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో సిక్‌రూమ్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు దోమతెరలు వాడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భూపతి దొర తదితరులు పాల్గొన్నారు.



మురుగుకాలువను పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న ప్రధాన రోడ్డులో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వెళ్లే వాహనాలను ఆపి, వాహన ధ్రువపత్రాలు, వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల్లో ఏవైనా అక్రమంగా తరలిస్తున్నారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన ధ్రువపత్రాలు లేని వారికి, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్ఐ పి.నారాయణరావు కోరారు.



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ నారాయణరావు

పంటకోత ప్రయోగం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బుడ్డెమ్మఖర్జ గ్రామంలో రైతు పేకాపు మురళి వరి పొలంలో పంటకోత ప్రయోగం శుక్రవారం నిర్వహించారు. ఎకరాకి 2,200 కిలోల ధాన్యం దిగుబడిగా వచ్చినట్లు అంచనా వేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జీవ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్ తెలిపారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్టు ఫీల్డ్ రిసోర్స్‌పర్సన్లు పి.గీత, వై.యశోద, జట్టు కో–ఆర్డినేటర్ జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు వెలుగు క్లస్టర్ కో–ఆర్డినేటర్ సీహెచ్ తిరుపతిరావు సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీవోఏలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న మహిళలు వివిధ వ్యాపారాలు ప్రారంభించి, ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతీ సభ్యురాలికి రూ.లక్ష వరకు స్త్రీనిధి రుణం మంజూరయ్యేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న వెలుగు క్లస్టర్ కో–ఆర్డినేటర్ తిరుపతిరావు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి..

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో అగ్నివీర్ ఉద్యోగవకాశాలపై ఎయిర్‌ఫోర్స్ సౌజన్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, నేవీ వంటి రక్షణ రంగంలో అనేక ఉద్యోగవకాశాలు ఉన్నాయన్నారు. యువత వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే వైద్య, ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక రంగం, ఫార్మసీ, తదితర రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ ప్రతినిధి లెఫ్టినెంట్ సందీప్ మాట్లాడుతూ.. ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ జి.కృష్ణమోహన్, మండల ప్రత్యేకాధికారి గియాజుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్